క్లుప్తంగా

కృత్రిమ కాలు పొందేందుకు పేర్లు నమోదు చేసుకోండి

పెనగలూరు : కృత్రిమ కాలు అవసరమున్న దివ్యాంగులు ఫోన్ నెంబర్ల ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్‌రావు అన్నారు. మార్చినెల 4, 5వ తేదీలలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాలు కొలతలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పదిరోజుల తరువాత రూ.51వేల విలువచేసే వెయిట్‌లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చడం జరుగుతుందని చెప్పారు. గతంలో రిజిస్టర్ చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోకూడదన్నారు. వివరాలకు 80746 23993, 91827 78324, 08562 295480 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీస్ స్టేషన్‌కు భారీకేడ్లు, కుర్చీలు వితరణ

లక్కిరెడ్డిపల్లి : క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ రాయచోటి బ్రాంచ్ వారు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు 20 భారీకేడ్లు, 10 కుర్చీలను లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తిరుపతి డీఎం జగదీష్, ఏరియా మేనేజర్ గిరిబాబు, బ్రాంచ్ మేనేజర్ ప్రభాకర్, ఫౌండేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

సుండుపల్లె : రేషన్ సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పంపిణీ చేయాలని తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తిమ్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు గ్రామాల్లోని ఇండ్ల దగ్గరకు పోయి ప్రజలకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆర్అండ్‌బీ బంగ్లా నిర్మాణానికి కృషి చేయండి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆర్ఎస్ రోడ్డులో బ్రిటీష్ కాలంలో నిర్మించిన బంగ్లా నేడు శిథిలావస్థకు చేరిందని దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిని అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు నూతన భవన నిర్మాణంతో పాటు ప్రహరీని ఏర్పాటు చేయాలని ఈఈని కోరినట్లు తెలిపారు.


ఆరోగ్య చిట్కాలు పాటించాలి

రాయచోటి టౌన్ : విద్యార్థులు వేసవిలో ఆరోగ్య చిట్కాలు పాటించాలని డాక్టర్ స్వాతి రెడ్డి సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని నారాయణ స్కూల్‌లో శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు ఆరోగ్య చిట్కాలు పాటించాలని చెప్పారు. ప్రధానంగా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లతోపాటు మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్. ఖాదర్ వలీ, ఏజీఎం శంకర్‌రెడ్డి, ఏడీ యువరాజు, ఏఓ నరసింహులు, ఎస్ఎస్‌టీ విద్యాసాగర్, వైస్ ప్రిన్సిపల్ సుగుణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

నందలూరు : నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్ఎస్ఐసీ)-2025 సీజన్ 8లో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు ఎన్.లక్ష్మీ చైతన్య, ఎస్.జైనబ్‌లు సత్తాచాటి మొదటి స్థానంలో నిలిచారు. ఈనెల 20వ తేదీ బెంగుళూరులో జరిగిన ఫైనల్స్‌లో విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వంగా ఉందని స్కూల్ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, కరస్పాండెంట్ గొబ్బిళ్ల శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కౌన్సిల్ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ సాహెబ్, స్టేట్ ఆర్గనైజ్ సెక్రటరీ సయ్యద్ జుల్ఫీకర్, మహమ్మద్ అజీజ్, అంకిపల్లి శివకుమార్‌లు విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



హోమంలో పాల్గొన్న రమేష్‌కుమార్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బుదిదగుంటపల్లిలో వెలసిన శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన హోమం కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్తులతో కలిసి స్వామివారికి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేష్ కుమార్ రెడ్డి హోమం కార్యక్రమం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి కృష్ణారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయె

- మహాశివరాత్రికి భక్తుల విశేష పూజలందుకోనున్న పరమేశ్వరుడు
- రద్దీ దృష్ట్యా పటిష్ట ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు, అధికారులు
- వైభవంగా జరుగనున్న కల్యాణోత్సవాలు
- రాత్రి జాగరణకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు



పెనగలూరు: కొలువైన బోడమల్లేశ్వరుడు



ఒంటిమిట్ట: మహాశివరాత్రికి ముస్తాబైన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సోమశిల వెనుక జలాల ప్రాంతమైన కుడుములూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం (నేడు) మహా శివరాత్రి సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయం కీ.శ 11వ శతాబ్దం నాటి ఆలయంగా చరిత్ర గడించింది. శ్రీశైల జ్యోతిర్లింగానికి ఉత్తర ద్వారాలుగా ఉన్న నాలుగు ఆలయాల్లో కుడమలూరు శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం ఒకటి. అయితే ఈ ఆలయం నాలుగేళ్ల క్రిందట శిథిలావస్థలో ఉండగా ఉత్సవ కమిటీ సభ్యులు చొరవతీసుకొని ఆలయాన్ని అభివృద్ధి చేశారు. దీంతో గత మూడేళ్లుగా కుడమలూరు శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. పర్యాటకులకు ఈ ఆలయ ప్రత్యేకత ఏమిటంటే సోమశిల వెనుకజలాలు మల్లేశ్వరస్వామి ఆలయం చుట్టూ ఉండటమే ఈ ఆలయ ప్రత్యేకత. బుధవారం (నేడు) మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరుగుతాయన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం శ్రీ కామాక్షి సమేత మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అన్నదాన కార్యక్రమంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

కోరిన కోర్కెలు తీర్చే బోడ మల్లేశ్వరుడు

పెనగలూరు : కోరిన కోర్కెలు తీర్చే బోడ మల్లేశ్వర స్వామి ఆలయాన్ని మహాశివరాత్రికి ముస్తాబు చేశారు. పెనగలూరు మండలం ఈటమాపురం, తూర్పుపల్లి గ్రామ సమీపంలో చెరువు అలుగు దగ్గర మల్లేశ్వరస్వామి ఆలయం కొలువై ఉంది. 13వ శతాబ్దంలో మట్లి భూపతిరాజు శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. మూలవిరాట్‌ను ప్రతిష్ఠించడంతోపాటు వేప మొలకను విగ్రహం పక్కనే నాటి వెళ్లాడు. ఆ వేప మొలకతోపాటు మూలవిరాట్ కూడా ఎత్తు పెరుగుతుందని గ్రామస్తులు పూర్వీకులు తెలియజేస్తున్నారు. గతంలో చిన్నగా ఉన్న మూలవిరాట్ ఇప్పుడు చాలా పెద్దదిగా కనిపిస్తుందని ఇక్కడ పూజలు చేస్తే వారి కోర్కెలు నెరవేరుతాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజల విశ్వాసం. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం చెక్కభజన, ఫండ్ర భజన కార్యక్రమాలు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవాన్ని గట్టువారిపల్లికి చెందిన రజనీకాంత్ రెడ్డి, శ్రీదేవీలు సహకారంతో నిర్వహించనున్నారు.



రాజంపేట రూరల్: విద్యుత్ దీపాలంకరణలో అత్తిరాల త్రేతేశ్వరుని ఆలయం

ముస్తాబైన శివాలయాలు

గాలివీడు/సంబేపల్లె/రామాపురం : ఆయా మండలాల్లోని శివాలయాలు మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఆలయ కమిటీలు, అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో కల్యాణోత్సవాలు వైభవంగా జరుపనున్నట్లు వారు తెలియజేశారు. గాలివీడు మండలంలోని గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయంతోపాటు ప్రధాన ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు చేశారు. అలానే సంబేపల్లె మండలంలోని మోటకట్ల శివాలయం, చిన్న జంగంపల్లె మల్లిఖార్జు స్వామి ఆలయాలు వేడుకలకు సిద్ధం చేశారు. రామాపురం మండలంలోని హసనాపురం గ్రామంలో కొలువైన గంగా భవానీ సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలియజేసింది. ఆయా ఆలయాల్లో వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపనున్నట్టు ఆయా ఆలయ అర్చకులు తెలియజేశారు.



గాలివీడు: గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయం



సుండుపల్లె : శివరాత్రికి విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన ఆలయం



చిట్వేలి: నక్కలపల్లి శ్రీ భవానీ శంకరస్వామి ఆలయం



పుల్లంపేట: పర్వదినానికి ముస్తాబైన శాంతిలింగేశ్వర స్వామి ఆలయం

టెండర్ల ఆహ్వానం

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో మరో మూడు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌లకు చేర్చేందుకు టెండర్లను పిలిచినట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మంగళవారం కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

1. నందలూరు మండల పరిధిలోని టంగుటూరు గ్రామం సమీపంలో ఉన్న నది నుంచి 4.5 హెక్టార్లలో 42,929.5 మెట్రిక్ టన్నులు
2. పెనగలూరు మండల పరిధిలోని నారాయణనెల్లూరు గ్రామ పరిధిలో 3.5 హెక్టార్లలో 39,824 మెట్రిక్ టన్నులు
3. పెనగలూరు మండలం కోమంతరాజపురం సమీపంలో ఉన్న రీచ్ నుంచి 3.5 హెక్టార్లలో 46,895 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు ఈ టెండర్లను పిలిచామన్నారు.

పై ప్రాంతాలలో ఇసుక రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ట్రాక్టర్ల సాయంతో తరలించాల్సి ఉంటుందన్నారు. కేవలం మనుషుల ద్వారానే ఇసుకను లోడ్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు తవ్వకం, రవాణాకు టన్నుకు రూ.110గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి మార్చి నెల ఒకటో తేదీ సాయంకాలం 5 గంటల వరకు సీల్ టెండర్లను రాయచోటిలోని జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మార్చి 3వ తేదీన సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యుల సమక్షంలో టెండర్లను ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు. టెండర్లను కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులోనే వేయాలని సూచించారు. టెండర్‌దారులు http://annamayya.ap.gov.in/notice/category/tenders వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందాలని సూచించారు.

ఉరుసు ప్రారంభం

మదనపల్లె సిటీ : స్థానిక కోటవీధిలోని సయ్యద్ ఖాజా సయ్యద్ మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గంధం హజరత్ గులాంఅలీషా దర్గా షరీఫ్ నుంచి వైభవంగా దర్గాకు చేరింది. దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలకరించారు. దర్గాలో ప్రత్యేక పూలతో మజార్లకు ప్రార్థనలు చేశారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి



పంచలింగాల వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి కోనలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచలింగాల వద్దకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలను కల్గించకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. కోనేరులో ఉన్న తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈయన వెంట ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌వోలు, విఆర్ఏలు ఉన్నారు.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

శ్రీ నిత్యపూజ స్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు కల్పిస్తున్నట్లు ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. పంచలింగాల కోన నుంచి నిత్యపూజా స్వామి కోన వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు చేపడుతున్నామన్నారు. ఒక డీఎస్పీ, 5మంది సీఐలు, 9 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 132 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, 20మంది హోంగార్డులు, ఆర్మ్‌డ్ గార్డ్స్ 4, స్పెషల్ మొబైల్ పార్టీ 8 మంది మొత్తం 178 మంది బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. వీరంతా శ్రీనిత్యపూజ స్వామి ఆలయంతోపాటు కనుమలోపల్లె నీలకంఠేశ్వరస్వామి, కపర్థీశ్వరస్వామి, జ్యోతి సిద్ధవటేశ్వర స్వామి ఆలయాల్లో బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ కోరారు.

ఆందోళన వద్దు.. ప్రశాంతంగా పరీక్ష రాయాలి



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందిస్తున్న ప్రిన్సిపల్

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి అత్యుత్తమ మార్కులు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ రమణరాజు ఆకాంక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సరస్వతీదేవి విగ్రహానికి విశేషంగా పూజలు నిర్వహించి విద్యార్థులకు ప్రిన్సిపల్ చేతులమీదుగా హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పరీక్షలకు సమయం దగ్గరపడే కొద్ది కొంతమంది విద్యార్థుల్లో ఆందోళన మొదలవుతుందని, అయితే ఎలాంటి ఆందోళనలు పెట్టుకోకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు.

నేటి నుంచి దేవరెద్దుల తిరునాల



చింతోల్ల మాలె దేవాలయం



శ్రీ మాలె పెద్దయ్యస్వామి మూలవిరాట్

చిన్నమండెం : చిన్నమండెం మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ ఇలవేల్పు దేవుడైన శ్రీ మాలే పెద్దయ్యస్వామి(దేవరెద్దు) తిరునాలను ఈ నెల 26వ తేదీ (నేటి) నుంచి నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రారంభమైన తిరుణాల బుధవారం సాయంత్రం దేవగుడిపల్లెలోని దేవరింటి నుంచి పెద్దయ్యస్వామి చెల్లెలైన సెలగోలమ్మ రాత్రికి జల్లావాండ్లపల్లికు చేరుకుని అక్కడ నుంచి దేవరెద్దుతో కలిసి జల్లావాండ్లపల్లి, బాపూజీనగర్‌కాలనీ, దేవగుడిపల్లె, కురవపల్లెల మీదుగా ఇంటింటా పూజలు అందుకుంటూ గురువారం ఉదయం చింతోల్లమాలెకు చేరుకుంటుందన్నారు. శుక్రవారం ఉదయం మళ్లీ పూజలు అందుకుంటూ దేవరిల్లు నుంచి జల్లావాండ్లపల్లెకు చేరుకుంటుందని చెప్పారు. తిరునాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నేషనల్ హైవేని పరిశీలించిన ఎన్‌టీసీఏ బృందం



హైవే రోడ్డును పరిశీలిస్తున్న ఎన్‌టీసీఏ బృందం

నందలూరు : కడప-రేణిగుంట మార్గంలో నిర్మించనున్న నూతన హైవే రోడ్డును నందలూరు ప్రాంతంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ నేపథ్యంలో అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) వారు ప్రతిపాదించిన అండర్ పాసెస్‌లు ఏర్పాటు చేసే స్థలాలను గుర్తించారు. అటవీ ప్రాంతంలోని జంతువులు రోడ్డుపైకి వచ్చి వాహనాలు ద్వారా ప్రమాదానికి గురి కాకుండా ఉండేందుకు ఈ అండర్ పాసెస్‌లను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీసీఏ అధికారి (ఐఎఫ్ఎస్) హరిణి, ఐఎఫ్ఎస్ యశోదబాయి, సీఎఫ్‌ఓ సెల్వం, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రవిశంకర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానెల్‌తో 'సౌరవృక్షం'

రాజంపేట రూరల్ : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలోని ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు జె.భూమిక, ఎస్.అనుశర్మ, పి.చరణ్, ఎస్.అహ్మద్, పర్యవేక్షకుడు డాక్టర్ కె.హరినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో సౌరవృక్షం ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టును అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏయూ ప్రో-చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ సౌరవృక్షం 6 సోలార్ ప్యానెల్‌లతో కూడి ఉంటుందన్నారు. ప్రతి ప్యానెల్ 50 వాట్స్, 24 ఓల్ట్స్ రేటింగ్ కలిగి ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ ఈ.సాయిబాబారెడ్డి, చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వీ.నారాయణ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలత విద్యార్థులను అభినందించారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



ఏనుగుల దాడిలో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు



మృతులకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : తలకోనకు వెళ్తూ వై.కోట సమీప శేషాచల అడవిలో ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు, క్షతగాత్రులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైల్వే కోడూరు కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, బీకేఎంయూ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరాం, రైల్వేకోడూరు మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, ఏరియా కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

రాయచోటి అర్బన్ : శివరాత్రిని పురస్కరించుకుని శంకరుని దర్శనం చేసుకునేందుకు వెళ్తున్న భక్తులకు భద్రతను కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండల పరిధిలోని గుండాలకోనలో శివదర్శనం కోసం వెళ్తున్న యాత్రికులపై ఏనుగుల మంద దాడిచేయడం, ముగ్గురు అక్కడికక్కడే మరణించి మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడం బాధాకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు తమ పార్టీ తరపున సానుభూతిని తెల్పుతున్నామన్నారు. మృతి చెందిన భక్తుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షలు, క్షతగాత్రులకు రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. వేసవి వస్తున్నందున అటవీప్రాంతంలో తినడానికి తిండి, తాగునీరు లేక పోవడంతో వన్యప్రాణులు అటవీ సమీప గ్రామాల్లోకి వస్తాయని తెలిసి గుండాలకోన సమీపంలో భక్తుల కోసం తగు భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఇందుకు జిల్లా ఫారెస్టు అధికారిని బాధ్యుడిని చేస్తూ వెంటనే సస్పెండ్ చేయడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె : ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 1,40,000లు ఆర్థిక సహాయాన్ని మంగళవారం ముక్కా వరలక్ష్మీ అందజేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలి ఆమె మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం మృతుల కుటుంబాలకు తమ ఫౌండేషన్ ద్వారా తక్షణ సహాయం అందించామని ముక్కా వరలక్ష్మీ తెలిపారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు



రాయచోటి జగదాంబసెంటర్ : పరమేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. శివం అంటే చైతన్యమని, శివుడి నుంచే యోగ సంప్రదాయం వచ్చిందని తరతరాల విశ్వాసమని ఆయన గుర్తు చేశారు. శివుడు లింగాకారంలో ఉద్భవించిన రోజు మహాశివరాత్రి అని తెలిపారు. అభిషేక ప్రియుడైన శివుడు ఆది దేవుడని, కోరిన వరాలిచ్చే భోళాశంకరుడన్నారు. శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్న భక్తులకు భోళా శంకరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రజలకు సుఖసంతోషాలను, భోగ భాగ్యలను, శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

క్రమశిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యం

చిట్వేలి : ఎన్‌సీసీతోనే ఉత్తమ క్రమశిక్షణ సాధ్యమవుతుందని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపులు రాజశేఖర్ ఎన్‌సీసీ పరీక్షా ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 బ్యాచ్ పరీక్షా ఫలితాలు వచ్చాయని ఇందులో 37 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఏ గ్రేడ్, నలుగురు బీ గ్రేడ్ పొంది వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ మేరకు పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందజేశారు. ఎన్‌సీసీ శిక్షణ ధృవపత్రాలను విద్య, ఉద్యోగ అవకాశాలలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గారాజు, బాదుషా తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో శివరాత్రి, ఇతర ఉత్సవాలసందర్భంగా భక్తుల కోసం 493 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం.రాము తెలిపారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట డిపోల నుంచి ఆయా ప్రాంతాలలో నిర్వహిస్తున్న శివరాత్రి మహోత్సవాలు, ఇతర తిరునాళ్ల ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. ముఖ్యంగా మదనపల్లె నుంచి మల్లయ్యకొండ, చిన్న మల్లయ్య కొండ, తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండకు మదనపల్లె, అంగళ్లు, పెద్దమండ్యం, తంబళ్లపల్లి, బి.కొత్తపేట, ములకల చెరువు ప్రాంతాల నుంచి 154 సర్వీసులను నడుపుతున్నామన్నారు. అలాగే మదనపల్లె డిపో నుంచి కలకడ, జరి, తవళం ఆలయాలకు 38 సర్వీసులు, పీలేరు డిపో నుంచి తలకోన, జర్రీ జాతరలకు 82 సర్వీసులు, రాజంపేట డిపో నుంచి అత్తిరాల, గుండాల కోన, తలకోన ప్రాంతాలకు 99 సర్వీసులు, రాయచోటి డిపో నుంచి పొలతల గంగమ్మ జాతరకు 120 సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. బస్సు సౌకర్యాన్ని జిల్లాలోని ప్రజలు, భక్తులు వినియోగించుకోవాలని డీటీఓ కోరారు.

శాస్త్రీయ ప్రతిభకు వేదిక సైన్స్ ఫెయిర్



ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శిస్తున్న అధికారి

ఒంటిమిట్ట : సైన్స్ ఫెయిర్ వేదిక విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను పెంచుతుందని మండల పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఉమా అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచలను ప్రోత్సహించడానికి వారి సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావడానికి ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఈ సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు పరిశీలించి వాటి పనితీరును అడిగి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కృషిని, విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, పద్మ, శివ నాయక్, రాజ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలి



కార్డులను పోస్ట్‌చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

రాయచోటి అర్బన్ : ఆప్కాస్‌ను కొనసాగించే వరకు దశలవారీ పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రామాంజులు పేర్కొన్నారు. ఆప్కాస్‌ను కొనసాగించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన ఉద్యోగులు, కార్మికులు మంగళవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని జగదాంబ సెంటర్ నుంచి పోస్టాఫీసు వరకు కార్మికులు సీఎం చంద్రబాబుకు స్వయంగా రాసిన పోస్టు కార్డులను చేతబట్టుకుని ర్యాలీ చేసిన అనంతరం బాక్స్‌లో కార్డులను పోస్టుచేశారు.

క్లుప్తంగా

ఉన్నత ఆశయంతో చదవాలి

సంబేపల్లె : విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివి కీర్తప్రతిష్టలు తెవాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసి స్కూల్ డే, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే ఉన్నత శిఖరాలకు

పుల్లంపేట : ఎస్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బీవీడీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు నాగా తిరుమల రావు, చక్రాధర్ రాజు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రామకృష్ణమనాయుడులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిభచాటిన విద్యార్థులు సలాకా పర్వీన్, సురక్ష, దినేష్ కార్తీక్‌లకు బహుమతులు అందజేశారు.

ఆలయానికి పంచలోహ ఆభరణాలు వితరణ

సుండుపల్లె : తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ చింతలయ్యగారిపల్లె శివాలయానికి 108 కిలోల పంచలోహాలతో మకర తోరణం, త్రిశూలం, దివ్యజ్యోతులను చేయించినట్లు తిరుమల ఏజెన్సీ యజమాని వెంకటేష్, వంశీకృష్ణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెక్ పోస్టు ఏర్పాటు

సిద్దవటం : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీనిత్యపూజ స్వామి కోనకు వెళ్లే వాహనాలకు ఆశ్రమం వద్ద మంగళవారం అటవీశాఖ వారి ఆధ్వర్యంలో తాత్కాలిక చెక్ పోస్టు ఏర్పాటు చేశామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. తాత్కాలిక చెక్‌పోస్టు వద్ద అటవీ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.